క్లుప్తంగా

నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గంట్యాడ: మండలంలోని మధుపాడలో కొలువైన ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శుక్రవారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో ఇటీవల పునఃనిర్మించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, లచ్చిరెడ్డి కృష్ణ, సర్పంచ్ కిలపర్తి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కుందెలు బహూకరణ



వెండి దీపం కుందెలు బహూకరిస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణానికి చెందిన సుంకరి శ్రీనివాసరావు, కమల దంపతులు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి 1250 గ్రాములతో రూ.85 వేలు విలువ చేసే వెండి దీపం కుందెలను బహూకరించారు. శుక్రవారం అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెండి దీపం కుందెలను ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్, దేవస్థానం ఈఓ జి.శ్రీనివాస్‌లకు అందజేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, కింతలి మధు, అడ్డాల రవి తదితరులు పాల్గొన్నారు.

పూరిపాక దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిపాక

గుర్ల: మండల కేంద్రంలోని గొల్లవీధిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిపాక పూర్తిగా దగ్ధం అయ్యింది. గ్రామానికి చెందిన కమ్మిండి అప్పలస్వామి చెందిన పాక కాలిపోయింది. ప్రమాదంలో విలువైన సామగ్రి కాలిపోయిందని బాధితుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామానికి ఆనుకొని ఉన్న తోటలో ఆకులు కాల్చడం వల్ల ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గురైనా పాకను రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి



గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో చర్చిస్తున్న డీఈ గౌరిశంకర్

గుర్ల: ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు గృహ నిర్మాణ శాఖ డీఈ గౌరిశంకర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. మండలంలోని 1400 ఇళ్లు ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలని, ఇప్పటికే 1200 ఇళ్లు గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యాయని, మిగిలిన 200 ఇళ్లు కూడా కూడ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఈ రామచంద్రరావు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



పాఠశాలకు అందించిన ఫర్నీచర్‌తో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు

దత్తిరాజేరు: మండలంలోని తిమిటేరు ప్రాథమిక పాఠశాలకు నాగపూర్‌కు చెందిన వైబ్రంట్ ఎనర్జీ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్(సోలార్ పవర్ సంస్థ) రూ.1.50 లక్షలు విలువచేసే ఫర్నీచర్‌ను వితరణ చేసింది. ఏడు టేబుళ్లు, ఏడు బుక్‌షెల్ఫ్‌లు, బీరువా, ఏడు కుర్చీలు, ఇతర సామగ్రిని సంస్థ ప్రతినిధులు భానుప్రకాష్, కృష్ణ, సుజన్‌కుమార్‌లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావుకు అందజేసినట్లు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ శుక్రవారం తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన సంస్థ ప్రతినిధులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

భూముల ఆక్రమణపై జేసీ సీరియస్

- పరుగులు తీసిన రెవెన్యూ, తోటపల్లి అధికారులు
- సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగింపు



ఆక్రమిత భూముల్లో సరే నిర్వహిస్తున్న తహసీల్దార్, సర్వేయర్, తోటపల్లి ఇంజినీర్

సాక్షి ఎఫెక్ట్...

చీపురుపల్లి: తోటపల్లి కుడి ప్రధాన కాలువ భూములు ఆక్రమణపై జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ సీరియస్ అయ్యారు. ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ, తోటపల్లి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎం.సురేష్, తోటపల్లి ప్రాజెక్టు జేఈ జి.సంతోషి ఆధ్వర్యంలో సిబ్బంది ఆక్రమణ స్థలం వద్దకు శుక్రవారం పరుగులు తీశారు. మండలంలోని రావివలస సమీపంలో గెడ్డమిల్లు జంక్షన్ వద్ద సర్వే నంబర్ 74లో తోటపల్లి కాలువ భూములు ఆక్రమణపై శుక్రవారం సాక్షి పత్రికలో 'తోటపల్లి భూములు ఆక్రమణ' అనే శీర్షికన కథనం వెలువడింది. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎం.సురేష్ తన సిబ్బందితో కలిసి ఆక్రమణ భూముల్లో సర్వే జరిపించారు. దీంతో 25 సెంట్లు తోటపల్లి భూములు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అంతేకాకుండా తక్షణమే ఆక్రమిత భూముల్లో కాలుకుడి కాళీదాసు అనే వ్యక్తి ఏర్పాటు చేసిన సిమెంటు స్తంభాలను తొలగించినట్లు తహసీల్దార్ సురేష్ స్పష్టం చేశారు. తదుపరి చర్యల కోసం పూర్తి స్థాయిలో నివేదికను జాయింట్ కలెక్టర్‌కు సమర్పిస్తున్నట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రవి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు

బొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఎస్సై ఎస్.రవి శుక్రవారం పరిశీలించారు. మార్చి 13న జరిగే ఈ ఎన్నికలకు సంబంధించి పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో వసతులు, పరిసరాలను పరిశీలించారు. పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

లక్కవరపుకోట : వచ్చే నెలలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీడీఓ కె.రూపేష్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ నంబరు 140, 140 ఏలో సౌకర్యాలను పరిశీలించారు. దివ్యాంగులు, వృద్ధుల ఓటర్లు పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ర్యాంప్, మెట్ల ఏర్పాట్లు చూశారు. పోలింగ్‌కు అనువైన అన్ని సౌకర్యాలు ఉన్నట్టు తహసీల్దార్ తెలిపారు. వారి వెంట పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ

జామి: పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. భాగ్యరేఖ అన్నారు. జేడీవలస గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి వైద్య సేవలందించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు, చెత్తపోగులు, పాతటైర్లు, తాగివడేసిన కొబ్బరి బొండాలు వంటివి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, సబ్ యూనిట్ అధికారి నందయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ ఎంపిక



విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను ఎంపిక చేసిన అధికారులు

గజపతినగరం: మండల పరిధిలోని 55 పాఠశాలల విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరంలో పంపిణీచేసేందుకు మండలానికి కేటాయించిన జగనన్న విద్యాకానుక కిట్లను బద్రపరిచేందుకు స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశామని ఎంఈఓ విమ లమ్మ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌ను శుక్రవారం ఆమె సందర్శించి ఒక గదిని స్టాక్ పాయింట్‌గా ఎంపిక చేశారు. విద్యాకానుక కింద నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫామ్ తదితర సామగ్రి ఏప్రిల్ నెలలో రానున్నాయని ముందుగా స్టాక్ పాయింట్‌ను ఎంపిక చేశామని చెప్పారు. అక్కడ నుంచి ప్రతీ స్కూల్‌కు వాటిని సరఫరా చేస్తామని తెలిపారు. సీఆర్పీలు రెడ్డి, శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం యు.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యాలు



వేపాడ: గురుకుల పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థీ ఉన్నత స్థాయికి ఎదగాలని పాఠశాల ప్రిన్సిపాల్ యు.ఉషారాణి అన్నారు. బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు శుక్రవారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పరీక్షలు దగ్గరపడుతుండడంతో విద్యార్థులు శ్రద్ధగా చదవాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకూడదని సూచించారు. అనంతరం విద్యార్థినులకు పెన్నులు, ప్లాంక్‌లు, పౌచ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుబాటులో వర్మీకంపోస్టు



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ జనార్దన్

గజపతినగరం రూరల్: సీతారామపురం, పిడిశీల గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో (ఎస్‌డబ్ల్యూపీసీ) రైతులకు విక్రయించేందుకు వర్మీ కంపోస్టు ఎరువు సిద్ధంగా ఉందని ఈఓపీఆర్డీ జనార్దన్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీలలో వర్మీ కంపోస్టు తయారు చేయగానే రైతులకు కిలో రూ.10 చొప్పున విక్రయించాలని సూచించారు. అలాగే రెండు గ్రామాల్లోనూ ఇంటి పన్ను వసూళ్లను మార్చి10వ తేదీనాటికి శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి గృహసారథులతో ఎమ్మెల్యే సమావేశం

దత్తిరాజేరు: ఇటీవల నియమితులైన గృహసారథులతో ఎమ్మెల్యే బొత్స అప్పలర్సయ్య గ్రామాల వారీగా సమావేశమై దిశానిర్దేశం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, సచివాలయ గృహసారథుల మండల కన్వీనర్ మహదేవ్ ఫణీంద్రుడు తెలిపారు. మండలంలోని విజయరాంపురంలో ఉన్న బంగారమ్మగుడిలో శనివారం పూజలు చేసి, అనంతరం అక్కడ గృహసారథులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం షికారుగంజి, రామచంద్రాపురం, పాచలవలస, ఎస్.చింతలవలస, పి.లింగాలవలస, ఎస్.భూర్జవలస, కె.కొత్తవలస, కె.కృష్ణాపురం, తాడేందొరవలస గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

11,800 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

బొండపల్లి: మండలంలో ఇంతవరకు 11,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి మిల్లులకు తరలించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి పి.వి.మల్లికార్జునరావు తెలిపారు. అలాగే జనవరి 20 వరకు మిల్లులకు తరలించిన ధాన్యం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఇంకా మండలంలో 800 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించామని, వాటిని కూడా రెండు మూడు రోజుల్లో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పరిశీలన

కొత్తవలస: విశాఖ – రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేను కలెక్టర్ సూర్యకుమారి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెందేరు, సంతపాలెం, వీరభద్రపురం, గులివిందాడ, రాజపాత్రునిపాలెం గ్రామాలలో జరుగుతున్న హైవే పనులను గ్రీన్‌ఫీల్డ్ హైవే సిబ్బందితో పరిశీలించి, పలు సూచనలు చేశారు.


డ్రైవర్‌గా మారిన పంచాయతీ కార్యదర్శి



చెత్త సేకరణ వాహనాన్ని నడుపుతున్న పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం పంచాయతీలో చెత్త సేకరణకు వినియోగించే వ్యాన్ డ్రైవర్ అత్యవసర పరిస్థితుల కారణంగా రెండు రోజులుగా విధులుకు హాజరు కావడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథ కృష్ణారావు డ్రైవర్‌గా మారి చెత్త సేకరిస్తున్నారు. గ్రామంలో ఎక్కడా చెత్త పేరుకు పోకూడదనే ఉద్దేశంతోనే కృష్ణారావే డ్రైవింగ్ చేయడంపై పలువురు అభినందనలు తెలియజేశారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న కృష్ణారావు ఇప్పటికే గవర్నర్, డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నారు.

భూ రీసర్వేతో రైతులకు ప్రయోజనం



భూములు రీసర్వేను ప్రారంభిస్తున్న కేవీ సూర్యనారాయణ రాజు

గుర్ల: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతునన్న సమగ్రభూరీసర్వేతో రైతులకు ప్రయోజనం చేకురుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు అన్నారు. మండలంలోని కెల్ల గ్రామంలో డ్రోన్‌తో చేపట్టిన సర్వేను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే వల్ల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ శివ, వైస్ సర్పంచ్ కొంచాడ ఈశ్వరరావు, కెల్ల వెంకటరమణ, కెల్ల సూర్యనారాయణ, కెల్ల సురేష్, కెల్ల పైడిరాజు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను దరి చేరనీయొద్దు...



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఆస్మాఫిరీన్

- ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఆస్మాఫిరీన్

కొత్తవలస: డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)అదనపు ఎస్పీ ఆస్మాఫిరీన్ సూచించారు. మండల కేంద్రానికి సమీపంలో గల ఏపీ మోడల్ స్కూల్‌లో ఎస్ఈబీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారంగా మారిపోతుందన్నారు.ఎవరైనా ఇటువంటి పదార్థాలు వినియోగించినా, విక్రయించినా తమ శాఖకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ వినియోగం వలన కలిగే అనర్థాలు, దుష్పరిణామాలు వీడియోల ద్వారా విద్యార్థులకు వివరించారు. అనంతరం సీఐ ఎస్.బాలసూర్యారావు, స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు ఎం.శృతి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా వుంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ పప్పల నరేంద్ర, స్థానిక ఎస్ఐ బొడ్డు దేవి, పాఠశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

బొండపల్లి: గ్రామాల్లోని వీధులు, మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.వి.రమణ కుమారి సూచించారు. మండలంలోని గొట్లాం గ్రామాన్ని శుక్రవారం సాయంత్రం ఆమె సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించి పంచాయతీ, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు అమలు చేయాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్. సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ ఉన్నారు.

ఓర్వలేక కట్టుకథలు, తప్పుడు రాతలు



ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ సురేష్ బాబు

- టీడీపీ నేత 'పట్టాభినీకొట్టారు' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన తప్పుడు కథనంపై ఎంపీ, ఎమ్మెల్యే మండిపాటు
- ఈనాడు పత్రిక ప్రతుల దహనం

గజపతినగరం: పేదప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఆదరణ మరింత పెరుగుతుండడంతో చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు ప్రభుత్వం పై కుట్రాలు, కుతంత్రాలు చేస్తుంటే...వారికి మద్దతుగా ఎల్లో మీడియా అసత్యకథనాలు వండివారుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నా యని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మండిపడ్డారు. టీడీపీ నేత పట్టాభినీ కొట్టారంటూ పాతఫొటోలతో ఈనాడు తప్పుడు కథనం ప్రచురించడంపై నిరసన తెలుపుతూ స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయ సమీపంలో ఈనాడు ప్రతులను ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పార్టీ నాయకులు శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తుంటే ఆయనపై పనిగట్టుకొని ఈనాడు,ఏబీఎన్, టీవీ–5 కలిసి తప్పుడు రాతలు రాస్తూ, కథనాలు రాస్తూ మీడియా రంగానికి విలువలు లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు, టీవీ–5, ఏబీఎన్ చానళ్లు చంద్రబాబు నాయుడును మళ్లీ సీఎం చేయాలనే లక్ష్యంతో, ఆయనకు కొమ్ముకాస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషపురాతలు రాసి, ప్రచారం చేసినా టీడీపీకి ఓటమి తప్పదని అన్నారు. ఎన్నికుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ 175కి 175 సీట్లలో విజయం ఖాయమని చెప్పారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందాం..

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే అప్పలనరసయ్య కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గృహసారథు లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఓటు హక్కు ఉన్న పట్టభద్రులందరినీ పార్టీ నాయకులు కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరాలని సూచించారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు, పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, సీనియర్ నాయకులు కొండపల్లి కొండలరావు, ఏఎంపీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి,గంట్యాడ మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాష్, వర్రి నరసింహమూర్తి, బొండపల్లి ఎంపీపీ చల్లా చల్లంనాయుడు, పార్టీ గజపతినగరం మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఫలితాలతోనే భవిష్యత్

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి యశోధనరావు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖాధికారి యశోధనరావు

శృంగవరపుకోట: పదో తరగతిలో విద్యార్థులు సాధించే ఫలితాలతోనే భవిష్యత్ నిర్ణయమవుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి ఎం.యశోధనరావు అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ సంక్షేమ వసతిగృహంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, పదికి పది పాయింట్లు సాధించాలన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు వి.జోగిందర్, వై.అప్పారావు, ఎం.సత్యనారాయణ, సుభాన్, మల్లేశ్వరరావు, ఆర్.వాసుదేవరావు, ఎం.దుర్గలక్ష్మిలతో పాటు సంక్షేమశాఖ వసతి గృహవార్డెన్లు కె.సత్యరాజ్, డి.చంద్రమౌళి, ఆర్.సత్యనారాయణ బి.శ్రీధర్ బి.చంద్రినాయుడు, పి.నీరజాకుమారి, డి.అనురాధ, గౌతమి, జి.పద్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠోత్సవం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దంపతులు, స్థానికులు



పూజల్లో పాల్గొన్న ఎంపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

శృంగవరపుకోట: పట్టణంలోని దేవీ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి, వల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, రమా దేవి సహిత సత్యనారాయణ స్వామి ఆలయాన్ని శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, విశాఖపట్నం ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆర్.జగన్నాథం, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తైనాల విజయకుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, సర్పంచ్ సంతోషికుమారి, తదితరులు పాల్గొన్నారు.